అందరూ ఎగిరెగిరి నవ్వినారు.

గోవిందుడు రోషంగా..

''నవ్వితే నవ్వినారు.. నాకేమీ బాధ లేదు. నేను ఈ మేకను బాగా సాకుతాను. ఏదో ఒకరోజు మా మేకను చూసేదానికి మీరందరూ మా ఇంటి ముందర 'క్యూ' కడతారు చూడండి..'' అని బదులిచ్చినాడు.

* * *

ఊర్లో గంగ జాతర జరుగుతున్నాది. పలకలు బలంగా మోగుతున్నాయి. ఊరి నిండా వేపాకుల తోరణాలు కట్టినారు.

గంగమ్మ గుడికి ఆగ్నేయాన ఆడోళ్లంతా పొంగళ్లు పెడుతున్నారు. మూడు పెద్ద రాళ్లు పెట్టి కట్టెలతో మంటపెట్టి 'ఉడికిందా? లేదా?' అని మెతుకుల్ని పట్టిపట్టి చూస్తూ ఉన్నారు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

పడుచు పిల్లలు పొంగళ్లు పెట్టేచోట కుర్రోళ్లు ఈగలు మాదిరి చుట్టకలాడుతున్నారు.

'ఏమైనా సహాయం కావాలా?' అని ఒకటికి రెండు సార్లు అడుగుతున్నారు.

పొంగళ్లు పెట్టే వయసు పైబడిన ఆడోళ్లు.. 'పని ఉంది' అని పిలిచినా, వినపడనట్లు ఉంటున్నారు.

ఊళ్లో వాళ్లు కుండలకు పసుపుకుంకుమలు పెట్టి, వేపాకు చుట్టిన గెరిగలు ఊరేగిస్తున్నారు.

సావాసగాళ్లతోటి గోవిందుడు వాటి వెనకే నడుస్తున్నాడు. రచ్చబండకాడికి వచ్చేసరికి తక్కోళం మామ చేతులు పైకెత్తి, నాలిక మడుస్తూ వచ్చి నిలబడినాడు.

''పలకలు సరిగా మోగడం లేదు. వేడి చేసుకోండి..'' అని చెప్పి, గడ్డి కొంచెం వేసి నిప్పు అంటించినాడు.

ఆ నిప్పు మంటల్లో పలకలను 'టంగు టంగు' అని కొడుతూ వేడి చేసినారు.

ఆ తర్వాత కొట్టిన పలకలకు తక్కోళం మామ.. 'జెజ్ జెజ్ జెజ్జినక..' అంటూ ఎగిరినాడు. అలసిపోతూ ఉంటే.. ఎవరో చేతి కర్చీఫ్ ఇచ్చినారు. రెండు చేతుల్లో దాన్ని పట్టుకుని 'డంగ్ టక.. డంగ్ టక..' అంటూ పంచె ఊడేంత వరకు ఎగిరినాడు. చుట్టూ చేరిన పిల్లోళ్లు పడీపడీ నవ్వినారు.

రాత్రి ఎనిమిదయ్యింది.

పంచాయితీ ఆఫీసు కాడికి ఊరి సర్పంచ్ మేకప్ మాన్‌ని తీసుకొచ్చినాడు. నచ్చిన వేషం వేసుకోండని పిలకాయలకు చెప్పినాడు. అంతే.. ఒకరు రాముడంటే.. మరొకరు కృష్ణుడంటే.. ఇంకొకరు నారదుడంటే.. తలా ఒక వేషం కట్టాలని అనుకున్నారు. గోవిందుడు తనకు నచ్చిన ఈశ్వరుడి వేషం వేసినాడు.

''నీకెందుకురా ఈశ్వరుడి వేషం అంటే ఇష్టం?'' అని అడిగినాడు మేకప్ మాన్.

''చంకలో పెట్టుకున్న నీళ్ల తిత్తి అదుముతూ ఉంటే.. నెత్తి మీదినుంచి గంగ పడటం భలే ఉంటది'' అని నవ్వుతూ బదులిచ్చినాడు.

వేషం వేసుకుని వీధులన్నీ తిరుగుతూ ఉంటే.. ఎగువ ఇండ్లకాడ చెంచు నాయుడి మూడో మనవరాలు ఎదురయ్యింది. క్లాస్‌మేట్ అయిన ఆ పిల్ల బులుగు పావడ, జాకెట్టు వేసి తలస్నానం చేసి వెంట్రుకలు ఆర బెట్టుకుంటున్నాది.

''ఏమిరా గోవిందా.. ఇద్దరు పెళ్లాలుండే శివుడి వేషం వేసినావు'' అని ఊగతా ఊగతా అడిగింది.

సిగ్గుమొగ్గలైన గోవిందుడి ముక్కు ఒకటికి రెండుసార్లు అదిరింది. ఆ ఊపులో అందరి ముందరా..

''శంకరా..'' అంటూ పాట పాడినాడు.

పాటతోపాటు శివ తాండవం కూడా చేయాలనిపించింది. అయితే నెత్తి మీద గంగ, ఒంటికి చుట్టిన పులి చర్మం జారి పడిపోతాయేమోనని ఆ పని చేయలేదు.

ఊరంతా తిరిగితిరిగి అలసి, రాత్రి రెండు గంటలకు పంచాయితీ ఆఫీసు కాడే వేషాన్ని తీసేసి ఇంటికి వచ్చినాడు. అందరూ నిద్రపోతున్నారు. శబ్దం చేయకుండా నేరుగా వెళ్లి మిద్దెపైన పడుకున్నాడు.

తెల్లారయ్యింది. చురచురమని ఎండ, కండ్ల మీద పడుతుంటే మెలుకువ వచ్చింది. కళ్లు తెరిచి చూశాడు.

ఇంటి ముందర పలకల శబ్దం జోరుజోరుగా వస్తున్నాది. 'ఏమిటా!?' అని తొంగి చూసినాడు.

మేకపోతుకు పసుపు కుంకుమలు రాసి ఉన్నారు. దాని మెడలో ముద్దబంతుల మాల వేసి ఉన్నారు. నడుము మీద తడి చేసిన పసుపు గుడ్డ వేసి వేపాకులు చుట్టి ఉన్నారు. గబగబా దిగి ఇంట్లోకి వచ్చినాడు గోవిందుడు. ఎదురైన నాన్నతో..

''సాక్కోవడానికి కదా మనం మేకను తెచ్చుకున్నది'' అని అడిగినాడు.

''ఓరి తిక్కలోడా.. దాన్ని ఎల్లకాలం సాకితే మనకేమి వస్తుందిరా? అమ్మవారికి బలి ఇచ్చి కూర అమ్ముకుంటే కదా మనకి డబ్బులొచ్చేది'' అని బదులిచ్చినాడు తండ్రి.

''నేను ఒప్పుకోను. నాతోనే పెంచుకుంటాను'' అని పెద్దగొంతుతో చెప్పినాడు గోవిందుడు.

''మేక మెడచన్ను కుడిస్తే ఆకలి తీరుతుందారా పిచ్చోడా!? పుస్తకాల్లో 'హింస చేయొద్దు.. జీవ హింస నేరం' అని ఏమేమో రాసి ఉంటారు. అది చదివి ఆచరిస్తా పోతే.. మనకి నోట్లోకి నాలుగేళ్లు ఎట్లపోతాయి!?'' అని చెప్పి, మేక గొంతుకు తాడు కట్టి రెండు అడుగులేసినాడు.

''ఈ పిలకాయలకు ఏమీ తెలియదు. మీరు కొట్టండిరా పలకలు'' అని గట్టిగా అరిచినాడు సిద్దులయ్య.

'డిమికి.. డిమికి...డిమికి' అని పలకలు కొట్టుకుంటూ మేకను గంగమ్మకు బలి ఇవ్వడానికి అందరూ బయలుదేరినారు. మేకపోతును బలవంతంగా ఈడ్చుకు పోవడం చూసి, తల తెగిన మేక మాదిరి గోవిందుడి మనసు గిలగిల్లాడింది. ఏడుస్తూ వెళ్లి, ఇంటి వెనక కానుగ చెట్టు కింద కూర్చున్నాడు.

పలకల బృందం తూర్పు వీధి నుంచి బయలుదేరింది. బడి పిల్లోళ్లు 'లక్కులక్కుం..' అని ఎగురుకుంటూ, దాని వెనుకే నడుస్తున్నారు.

బిత్తర బిత్తర చూపులు చూస్తూ నడుస్తున్నాది మేక.

పడమటి వీధిలోకి వెళ్లింది పలకల బృందం.

ఆ వీధి ఆడోళ్లు..

''ఎన్నో మేకల తలలు కసాయి అంగట్లో తెగతాయి. ఈ మేకకి ఎంత అదృష్టమో కదా.. అమ్మవారికి నైవేద్యం అవుతన్నాది'' అని మేకను చూసి దండాలు పెట్టినారు.

బెదురు చూపులు చూసింది మేక.

పలకల బృందం ఉత్తరం వీధిలోకి నడిచింది.

అప్పుడే నలుగురు కుర్రోళ్లు.. 'గంగ తాగితేనే కదా గంగ జాతర' అని తాగినంత తాగి అక్కడికి వచ్చినారు.